ఉక్కు మహిళ ఇందిరాగాంధీ

భారతదేశపు కీర్తిని ప్రపంచం నలుమూలలా చాటిచెప్పిన ఉక్కు మహిళ ఇందిరాగాంధీ. ఆమె రాజకీయ, వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని శక్తిమంతమైన నాయకురాలిగా భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఇందిరాగాంధీ దేశానికి అందించిన నిరుపమాన సేవలు నాటితరం నాయకులకే కాదు నేటితరం నాయకులకు సైతం స్ఫూర్తిదాయకం. జనరంజక పాలన అందించి ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న నాయకురాలు ఇందిరా గాంధీ. గతంలో పాలన అంటే.. ఇందిరమ్మ రాజ్యంలా ఉండాలనే అంతగా గుర్తింపు వచ్చింది. తిరుగులేని నేతగా ఎదిగారు. దేశ రాజకీయాలను ఒంటి చేతితో శాసించారు. బలమైన నాయకురాలుగా ప్రత్యర్థి పార్టీలకు వణుకు పుట్టించారు. తన పాలనలో ఎన్నో సంచలన నిర్ణయాలు తీసుకున్నారు.

1947లో భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చాక మొట్టమొదటి, ఏకైక మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ. 49 ఏళ్ల వయసులోనే దేశ ప్రధానిగా కీలక బాధ్యతలు చేపట్టిన ఆమె.. సుమారు 16 ఏళ్లకు పైగా దేశానికి సేవలందించారు. ఇందిరాగాంధీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎన్నో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. బ్యాంకుల జాతీయకరణ, జమీందారీ వ్యవస్థ రద్దు, గరీబీ హఠావో వంటి గొప్ప పథకాలతో భారతదేశ అత్యున్నత ప్రధానిగా ఇందిరాగాంధీ నిరూపించుకున్నారు. ఐరన్ లేడీగా పేరొందిన ఆమె.. వాజ్ పేయి లాంటి వారితో దుర్గాదేవిగా కీర్తించబడ్డారు. తన జీవితాన్ని దేశానికి అంకితం చేసిన ఇందిరా గాంధీ. నేడు ఆమె జయంతిని పురస్కరించుకుని ఈ సందర్భంగా ఆమె దేశానికి చేసిన సేవలు, ఆమె తీసుకున్న సాహసోపేత నిర్ణయాలపై ప్రత్యేక కథనం..

బాల్యంలోనే బాల్ చరఖా సంఘ్ స్థాపన

ఇందిరాగాంధీ 1917 నవంబర్ 19న అలహాబాద్‌లోని ఆనంద్ భవన్‌లో భారత దేశపు తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, కమలా నెహ్రూ దంపతులకు జన్మించారు. ఆమె అసలు పేరు ఇందిరా ప్రియదర్శిని. శాంతినికేతన్ లోని విశ్వభారతి, ఆక్స్ ఫర్డ్ విశ్వ విద్యాలయంలో విద్యనభ్యసించింది. అనేక అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్ డిగ్రీలు పొందారు. అలాగే కొలంబియా యూనివర్శిటీ నుంచి విశిష్ట ప్రశంసా పత్రం అందుకున్నారు.

తండ్రి,తాత అడుగుజాడల్లో నడిచిన ఇందిర..

లేలేత వయసు నుంచి తండ్రి, తాత పాల్గొంటున్న స్వాతంత్ర్య సంగ్రామ విషయాలు గ్రహించుకొంటూ వారి అడుగుజాడల్లో నడుస్తూ అద్వితీయ సేనను తయారు చేసి నాయకత్వం వహిస్తూ బ్రిటీష్ వారిని ఎదిరించింది ఇందిర. 1930లో సహాయ నిరాకరణ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీకి సహాయంగా ఉండేందుకు పిల్లలతో కలసి "వానర్ సేన" ఏర్పాటుచేశారు. 1934 ప్రాంతంలో తండ్రి స్వాతంత్ర్య పోరాటంలో జైలు పాలై, తల్లి మరణించగా ఆ పరిస్థితులకు భయపడక గుండె నిబ్బరంతో పైకి ఎదుగుతూ తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంది. జైలు నుంచి తన తండ్రి రాసిన లేఖలు చదువుతూ ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటూ నాయకత్వ లక్షణాలు అలవరచుకున్నారు. బాల్యంలో ఆమె "బాల్ చరఖా సంఘ్" స్థాపించారు. సాతంత్ర్య పోరాటంలో ఇందిరాగాంధీ చురుకుగా పాల్గొన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం మొదలయింది. జవహర్‌లాల్ నెహ్రూ కారాగారం నుండి విడుదల అవుతూనే మళ్ళీ అరెస్టు అయ్యారు. గాంధీజీ కూడా అరెస్టు అయ్యారు. అరెస్టుకు నిరసనగా దేశమంతా సమ్మెలు జరిగాయి. అయితే బ్రిటిష్ వారు పోలీసు బలంతో సమ్మెలను అణచివేసారు. ఈ నేపథ్యంలో ఇందిర 1942 సెప్టెంబర్‌లో జైలుకు వెళ్ళారు. 1943 మే 13న విడుదలయ్యారు.1947లో ఢిల్లీలో అల్లర్లకు గురైన ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. కాగా, లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదువుకునే సమయంలో పాత్రికేయుడు ఫిరోజ్‌తో స్నేహం.. ప్రేమగా మారి వివాహానికి దారి తీసింది. వీరిద్దరి కుల, మతాలు వేరైనా గాంధీజీ ఆశీస్సులతో ఇందిరాగాంధీ 1942 మార్చి 26న ఫిరోజ్‌గాంధీని వివాహమాడారు. ఆమెకు ఇద్దరు కుమారులు. ఆమె అరెస్టు అయి కారాగారానికి వెళ్ళి కారాగారంలో ఉండగానే ఆమె ఒక మగ పిల్లవాడికి తల్లి అయింది. ఆ పిల్లవాడికి రాజీవ్ అని పేరు పెట్టారు.

మెదక్ నుంచి బరిలో దిగి గెలిచిన ఇందిరా గాంధీ..

మెదక్ పార్లమెంట్ స్థానానికి ప్రత్యేకత ఉంది. ఇక్కడ నుంచి 1980 ఎన్నికల్లో ఇందిరాగాంధీ రాయ్ బరేలీతోపాటు మెదక్ నుంచి పోటీ చేసి గెలిచారు. అయితే ఆమె రాయ్ బరేలీ స్థానంలో రా జీనామా చేసి మెదక్ నుంచే పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇక్కడ ఎంపీగానే ప్రధాని పీఠమెక్కారు.ప్రధాని ఇందిరాగాంధీ 1984 అక్టోబరు 31న హత్యకు గురయ్యే నాటికి మెదక్ ఎంపీగానే ఉన్నారు. మెదక్ ఎంపీగా ఆమె పలు సందర్భాల్లో మెదక్ జిల్లాకు వచ్చారు. 1984 జులై 19న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌ల సదస్సుకు హాజరయ్యారు. మెదక్‌లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, తదితర పనులకు శంకుస్థాపన చేశారు. సంగారెడ్డిలో జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో కూడా ఇందిరాగాంధీ పాల్గొన్నారు.

ఆపరేషన్ బ్లూ స్టార్...

1984 వ సంవత్సరంలో పాకిస్తాన్ ప్రేరేపిత ఖలిస్తాన్ తీవ్రవాదులు కొంతమంది భక్తులను బందీలు గా చేసుకుని అమృత్ సర్ లో గల గోల్డెన్ టెంపుల్ లో దాక్కున్నారు.ఇండియన్ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం వారి వద్ద భయంకరమైన మారణాయుధాలు ఉన్నాయి. మూడు రోజుల పాటు సాగిన చర్చల తర్వాత వారు లొంగిపోవటానికి నిరాకరించారు. విధి లేని పరిస్థితుల్లో ఇందిరా గాంధీ మిలిటరీ ఆపరేషన్ కి అనుమతి ఇచ్చారు.రెండు రోజుల పోరాటం అనంతరం వారందరినీ మట్టు బెట్టారు కాని సైనిక పోరాటంలో ఆలయం బాగా దెబ్బతింది. సిక్కుల ఆచారం ప్రకారం ఆలయంలోకి బూట్లు వేసుకుని వెళ్ళరాదు. ఆలయంలో మిలిటరీ ఆపరేషన్ కి అనుమతి ఇచ్చినందుకు సిక్కులు ఇందిరా గాంధీ మీద వ్యతిరేకత పెంచుకున్నారు. సిక్కులు కోపంగా ఉన్నారని ఇందిరా గాంధీ వద్ద ఉన్న సిక్కు బాడీ గార్డ్ లను తీసెయ్యాలి అని చెప్పినా ఆవిడ వినలేదు.4 నెలల అనంతరం 1984 అక్టోబర్ 31న తన ఇద్దరు అంగరక్షకుల చేతిలో హత్యకు గురయ్యారు. ఆమె అంగరక్షకులలో ఒకరైన బియాంత్ సింగ్ తుపాకీతో ఆమెపై కాల్పులు జరిపాడు. అనంతరం మరో అంగరక్షకుడు సత్వంత్ సింగ్ తన తుపాకీతో ఇందిరాగాంధీపై కాల్పులు జరపడంతో ఆమె నేలకొరిగారు. రక్తపు మడుగులో ఉన్న ఇందిరాగాంధీని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. 'వంటి నిండా బుల్లెట్ గాయాలతో ఉన్న ఇందిరా గాంధీని ఆసుపత్రికి తీసుకొచ్చారు. బుల్లెట్లు ఆసుపత్రి నేలనిండా చెల్లాచెదురుగా పడిపోయాయి. ఆమె శరీరం నుంచి రక్తం ధారగా కారుతోంది. ఆమె పొట్టలోంచి రక్తం ఉబికివస్తోంది. ఆమెను కాపాడటానికి నాలుగు గంటలపాటు వైద్యులు, సర్జన్లు, నర్సింగ్ స్టాఫ్ ఎంతగానో శ్రమించారు.

ఆమె ప్రాణాలు కాపాడలేకపోయారు. ఇందిరా గాంధీ 1984 అక్టోబర్ 31న తన అంగరక్షకుల చేతిలోని తుపాకీ గుండ్లకు బలై ప్రాణాలు వదిలారు. కాగా, ఇందిరాగాంధీ మరణం దేశానికి గొప్ప విషాదాన్ని, తీరని లోటును మిగిల్చింది.

దుర్గాదేవిగా అభివర్ణించిన వాజ్‌పేయి..

సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఇందిర వెనుకాడేవారు కాదు. తన హయాంలో వ్యవసాయం, అంతరిక్షం, అణుశక్తి ఇలా రంగాల్లో పురోగతి సాధించేందుకు కృషి చేశారు. ఆమె ప్రధానిగా ఉన్నప్పుడు విపక్ష నేతలు ఎన్ని విమర్శలు చేసినా కూడా ఇందిరా గాంధీ ధైర్యంగా ముందుకెళ్లేవారు. ముఖ్యంగా తూర్పు పాకిస్థాన్ అంటే ప్రస్తుతం ఉన్న బంగ్లాదేశ్ విముక్తికి ఆమె తీసుకున్న నిర్ణయానికి మాజీ ప్రధాని అటల్ బీహారీ వాడ్‌పేయి ఇందిరాను దుర్గాదేవిగా అభివర్ణించారు. అలీనోద్యమానికి, విదేశాంగ విధానాలకు నాయకత్వం వహిస్తూ జై జవాన్', 'జై కిసాన్' అన్న పదాలకు పూర్తి ప్రాముఖ్యతనిస్తూ, విద్య, వైద్య, వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతిక రంగాలలో అభివృద్ధి పయనం కొనసాగిస్తున్న భారత దేశానికి ప్రధానిగా ఉంటూ, శాంతిస్థాపనకు ప్రధాన పాత్ర పోషిస్తూ, మతసామరస్యానికి పెద్దపీట వేసిన ఆమె దేశభక్తి, ధైర్య సాహసాలు, దేశాభివృద్ధికి ఆమె చూపిన మార్గం దేశ ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోయారు. ఇందిరా గాంధీ 'భారతదేశపు ఉక్కు మహిళ' గా ప్రపంచ దేశాల నాయకుల మన్ననలు పొందారు. ఇందిరా గాంధీ భారతదేశ ఏకైక మహిళా ప్రధానమంత్రిగానే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా మహిళలకు స్ఫూర్తినిచ్చే నాయకురాలిగా చరిత్రలో నిలిచిపోయారు. ఇండియాయే ఇందిరగా... ఇందిరయే ఇండియాగా సామాన్య ప్రజానీకం చెప్పుకునే స్థాయిలో ఇందిరా గాంధీ భారత జాతి గుండెల్లో సుస్థిర స్థానమేర్పరచుకొన్నది. ఆమెకున్న అకుంఠిత దీక్ష, కార్యదక్షత, భారతదేశ అభివృద్ధికి తీసుకున్న కీలకమైన నిర్ణయాలను ఆమె జయంతి సందర్భంగా మననం చేసుకుని ఉక్కు మహిళకు ఘనంగా నివాళి అర్పిద్దాం.

పోతుగంటి వెంకటరమణ
బ్యూరో చీఫ్, విశ్వంభర దినపత్రిక

ఇందిరాగాంధీ రాజకీయ ప్రస్థానం..

1947-64 మధ్య కాలంలో నెహ్రూ భారత ప్రధానిగా ఉన్నంత కాలం ఆయనకు తోడూ నీడగా ఉంటూ రాజనీతి మెళుకువలను వంటబట్టించుకున్నారు. 1955లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, పార్టీ ఎన్నికల కమిటీలలో సభ్యురాలిగా నియమితులయ్యారు. 1956లో అఖిల భారత యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గాను పనిచేశారు. 1958లో కాంగ్రెస్ కేంద్ర పార్లమెంటరీ బోర్డు సభ్యురాలిగా నియమితులయ్యారు. 1959లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేపట్టి 1960 వరకు ఆ పదవిలో కొనసాగారు.1978లో మళ్ళీ అదే పదవిని చేపట్టారు. 1964లో ఆమె తండ్రి, భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మరణం అనంతరం ఇందిరా గాంధీ రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1964 నుంచి 1966 వరకు లాల్ బహదూర్ శాస్త్రి మంత్రిమండలిలో ప్రసారశాఖ మంత్రిగా ఆమె విశిష్ట సేవలు అందించారు.1966 జనవరి 2 న తాష్కెంట్లో జరిగిన విమాన ప్రమాదంలో లాల్ బహదూర్ శాస్త్రి మరణించగా ఈక్రమంలో 1966లో మొదటిసారి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించి.. దేశ మొదటి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ చరిత్ర సృష్టించారు. ఇందిరా గాంధీ తొలి మహిళా ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన ఘట్టం భారత దేశ చరిత్రలోనే సువర్ణక్షరాలతో లిఖించదగినది. 1966 జనవరి నుంచి 1977 మార్చి వరకు భారత అత్యున్నత ప్రధానమంత్రి పదవిని అలంకరించారు. ఇదే కాలంలో 1967 సెప్టెంబర్ నుంచి 1977 మార్చి వరకు అణు ఇంధన శాఖ మంత్రిగా పనిచేశారు. 1967 సెప్టెంబర్ 5 నుంచి 1969 ఫిబ్రవరి 14 వరకు విదేశీ వ్యవహారాల మంత్రిగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. 1970 జూన్ నుంచి 1973 నవంబర్ వరకు హోం మంత్రిత్వశాఖకు నాయకత్వం వహించారు. 1972 జూన్ నుంచి 1977 మార్చి వరకు అంతరిక్ష వ్యవహారాల మంత్రిగా పనిచేశారు. 1980 జనవరి నుంచి ప్రణాళికా సంఘం ఛైర్ పర్సన్‌గా వ్యవహరించారు. 1980 జనవరి 14న మళ్ళీ ప్రధానమంత్రి పదవిని చేపట్టారు. విభిన్నమైన విస్తృతాంశాల పట్ల ఆసక్తి కలిగిన ఇందిరాగాంధీ జీవితం పట్ల సమగ్ర దృక్పథం కలిగి ఉండేవారు. శ్రీమతి ఇందిరాగాంధీ ఎన్నో విజయాలు అందుకున్నారు.

దేశ ప్రధానిగా విప్లవాత్మక నిర్ణయాలు..

ఇందిరాగాంధీ జనవరి 1966 నుంచి మార్చి 1977 వరకు, మళ్లీ జనవరి 1980 నుంచి అక్టోబర్ 1984లో ఆమె మరణించే వరకు భారత ప్రధాన మంత్రిగా విశిష్ట సేవలందించారు. ఇందిరా గాంధీ తన పాలనలో ప్రధానమైన ఆర్థిక, సాంకేతిక, భౌగోళిక అంశాలపై అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 1962లో చైనాతో జరిగిన యుద్ధంలో భారత్ ఓటమిపాలైంది. దీంతో దేశ ఆర్థికవ్యవస్థ క్షీణించిపోయింది. ఈ ప్రభావానికి మూడో పంచవర్ష ప్రణాళికను కూడా ఆపివేయాల్సి వచ్చింది.1966 జనవరిలో ఇందిరా గాంధీ మొదటిసారిగా ప్రధాని పదవి చేపట్టాక వార్షిక ప్రణాళికలు అమలు చేశారు. దేశ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు కారణమైన కొఠారీ కమిషన్ సిఫార్సులను అమల్లోకి తీసుకొచ్చి ఐరన్ లేడీగా ఎదిగిపోయారు. 1967 పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇందిరాగాంధీ విజయం సాధించి రెండోసారి ప్రధాని అయ్యారు.1968లో హరిత విప్లవం ద్వారా అధిక దిగుబడిని అందించే గోధుమ, వరి వంగడాలను సృష్టించి, భవిష్యత్ తరాలకు ఆహార కొరత రాకుండా ఆమె కృషి చేశారు. అలాగే 1969లో 14 వాణిజ్య బ్యాంకులను జాతీయం చేశారు. అంతేకాదు అంతరిక్షంలోకి తొలి భారతీయుడిని పంపారు. అక్కడికి వెళ్లిన వ్యోమగామి రాకేశ్ శర్మతో కూడా ఆమె మాట్లాడారు.1969లో బ్యాంకులను జాతీయం చేశారు. 1970లో శ్వేత విప్లవం ద్వారా పాడిపరిశ్రమను వృద్ధిలోకి తీసుకొచ్చారు. 1971లో పాకిస్తాన్‌పై విజయం, బంగ్లాదేశ్ ఏర్పాటులో కీలక పాత్రతో ఆమె అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంతోపాటు భారత ప్రతిష్ఠను పెంచారు. ఇక 1972 ఎన్నికల్లో 'గరీబీ హఠావో' నినాదంతో మూడోసారి అధికార బాధ్యతలు తీసుకున్నారు.1974లో పోఖ్రాన్ లో అణుశక్తి పరీక్షలు జరిపి అగ్రదేశాలను ఇండియా వైపు చూసేలా చేశారు. ఆ తర్వాత 1976లో దేశ రాజ్యాంగ పీఠికలో లౌకిక, సామ్యవాద పదాలను చేర్చారు. తొలిసారిగా కామన్వెల్త్ దేశాల సదస్సు, ఢిల్లీలో ఆసియన్ గేమ్స్ సైతం నిర్వహించారు. హర్యానా, పంజాబ్ రాష్ట్రాలు ఏర్పాటు చేయటంలో ప్రధాన పాత్ర పోషించారు. 1970 లో మేఘాలయ రాష్ట్రం ఏర్పాటు చెశారు. , పూర్వపు సంస్థానాధీశులకిచ్చే రాజభరణాలు రద్దు చేశారు. 1971 జరిగిన ఇండో పాక్ యుద్ధ సమయంలో సంయమనం పాటించారు. బంగ్లాదేశ్ విమోచనకు ధైర్యంగా సాయం చేశారు. ఐదవ పంచవర్ష ప్రణాళికలు (1971-76) కు రూపకల్పన చేశారు. 1975 లో దూరదర్శన్ టీవీ కేంద్రాలు స్థాపించటంలో ముఖ్యపాత్ర పోషించారు. కట్టుబానిసత్వం (బాండెడ్ లేబర్) నిర్మూలించారు. అలాగే ఇళ్లు లేని పేదల కోసం పక్కా ఇళ్ల నిర్మాణం, ఉపాధి కల్పన, భూమి పంపిణీ వంటివి ప్రారంభించారు. ఆమె తీసుకొచ్చిన గ్రీన్ రివల్యూషన్ (హరిత విప్లవం) దేశంలో ఆహార ఉత్పత్తులను పెంచడానికి దోహదపడింది. ఆమె ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం భారతదేశంలో ఆకలి సమస్యను పరిష్కరించడంలో సహాయపడింది. 20 పాయింట్స్ కార్యక్రమం నిరుద్యోగం, పేదరిక నిర్మూలన, విద్య, ఆరోగ్య రంగాలలో సమగ్ర అభివృద్ధికి తోడ్పడింది. అంతేకాకుండా ఆమె తీసుకున్న ఎమర్జెన్సీ నిర్ణయం వివాదాస్పదమైంది. ఆమె పేదల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. దళిత, గిరిజన, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేశారు. దీనజనుల ఉద్ధరణకు ఎన్నో ప్రణాళికలు తయారు చేశారు ఇందిరా గాంధీ. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లోని ప్రజలు ఇందిరాగాంధీ సేవలను, చేపట్టిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుని ప్రశంసిస్తారు. ముఖ్యంగా తెలంగాణ ప్రజలైతే ఆమెను ఇప్పటికీ ప్రేమగా 'ఇందిరమ్మ' అని పిలుస్తుంటారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com